క్లుప్తంగా

సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పాఠశాలల్లో సోమవారం నుంచి ప్రారంభమైన సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలను మంగళవారం ఎంఈఓ మునిసుబ్రమణ్యం పరిశీలించారు. కల్లివెట్టు, నెళవాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. హెచ్ఎం వాణి, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, లక్ష్మయ్య, మాధవీలత, సుజన, నాదెండ్ల మురళి, జగన్నాథం, దాసు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

కేవీబీపురం: నిండు గర్భిణికి అత్యవసర సమయంలో 108 సిబ్బంది చాకచక్యంగా కాన్పు చేశారు. మండలంలోని మోరీస్‌కండ్రిగ గ్రామానికి చెందిన సౌందర్య అనే మహిళ పురిటి నొప్పులతో మంగళవారం తెల్లవారుజామున 108ను సంప్రదించింది. నిమిషాల్లో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గమధ్యలో అత్యవసర చికిత్స కోసం పైలట్ నాగయ్య వాహనాన్ని రోడ్డు పక్కన ఆపాడు. స్థానిక ఆశావర్కర్, ఈఎంటీ ఏసు నాగరాజు ఆ మహిళకు చికిత్స అందించి కాన్పు చేశారు. గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

అవయవదానంపై అవగాహన



రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల పంపిణీ

రేణిగుంట: కరకంబాడి సమీపంలోని అమర హాస్పిటల్ ప్రాంగణంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం అమర హాస్పిటల్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కె. శివపార్వతి అవయవదానం గురించి వివరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారి చేత అవయవదానం చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అవయవదానం చేసేందుకు అంగీకరించిన వారికి సరిఫికెట్లు పంపిణీ చేశారు. అమర ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్, అమర ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి, సీఓఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాళహస్తి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాలల్లో నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, ఏఐఎస్ఎఫ్ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అభి, శివ హాజరై జెండా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీఓలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐఎస్ఎఫ్ శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చైతు ముఖేష్, ఆసిఫ్ పాల్గొన్నారు.

జాతర సందడి

- కోలాహలంగా రేణిగుంట గంగమ్మ జాతర
- భక్తులతో పోటెత్తిన ఆలయ ప్రాంగణం
- విశేషంగా ఆకట్టుకున్న కేరళ వాయిద్యాలు
- అమ్మవారి సేవలో ఎమ్మెల్సీ సిపాయి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



భక్తులను కటాక్షిస్తున్న గంగమ్మ



ఆలయ ఆవరణలో పొంగళ్లు పెడుతున్న మహిళలు



ఆలయ ఆవరణలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



జాతర వేషంలో చిన్నారి

రేణిగుంట: గ్రామ ఇలవేల్పుగా పూజలందుకుంటున్న రేణిగుంట గంగమ్మ జాతర మంగళవారం కోలాహలంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే గంగమ్మ గుడి భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంటి నుంచి మహిళలు సంప్రదాయ దుస్తులతో పూజా సామగ్రిని తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఏర్పాటుచేసిన కేరళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎక్కడెక్కడో స్థిరపడిన స్థానికులంతా జాతరకు విచ్చేసిన పలువురు ఆనందంగా గడిపారు. స్థానిక ప్రభుత్వ పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా పట్టణంలోని పలువురు ఆలయ ప్రాంగణంలో ప్రసాదాలు, శీతల పానీయాలు, మధ్యాహ్నం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త సోల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రేణిగుంట పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆకట్టుకున్న కేరళ వాయిద్యాలు

గ్రూపులతో టీడీపీ ఉనికికే ప్రమాదం



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మురళి

తిరుపతి కల్చరల్ : టీడీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి గ్రూపు రాజకీయాల కారణంగా పార్టీ ఉనికికే ప్రమాదముందని పలువురు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో నాగలాపురం, కేవీబీపురం, నారాయణవనం మాజీ ఎంపీపీలు మురళి, సుబ్రమణ్యం, గోవిందస్వామి మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదిమూలం విజయం కోసం టీడీపీ క్యాడర్ కష్టపడి పనిచేసిందన్నారు. అయితే శంకర్‌రెడ్డి మాత్రం కష్టపడిన వారిని విస్మరించి ప్రతిపక్ష నేతలతో సఖ్యతగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పైగా పార్టీ గెలుపు కోసం శ్రమించిన ఐదుగురు కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించారని మండిపడ్డారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కూడా సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఆదిమూలం ఫొటోలు లేకుండా ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రశ్నిస్తే అక్రమ కేసులతో వేధిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం స్పందించి శంకర్‌రెడ్డిని నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే చలో విజయవాడకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు సుమాంజలి, నారాయణవనం సర్పంచ్ రవి పాల్గొన్నారు.

విలీనం వద్దని ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కేవీబీపురం: బడుల విలీన ప్రక్రియను నిరసిస్తూ మండలంలోని ఏపీ పురం, బంగారమ్మ కండ్రిగ, గురుకుల కండ్రిగ, పాతపాళెం గ్రామాల ప్రజలు మంగళవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ప్లకార్డుల ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలీన ప్రక్రియను అడ్డుపెట్టుకుని కేవీబీపురం ఎంఈఓ, వారి సిబ్బంది బడుల మ్యాపింగ్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. అధికారుల తప్పిదం కారణంగానే తమ బిడ్డలు గత మూడు నెలలుగా బడులకు దూరమయ్యారని తెలిపారు. జిల్లా అధికారులు ఆదేశించినప్పటికీ ఎంఈఓ లక్ష్మీపతి వారి ఆదేశాలను పట్టించుకోవడం లేదన్నారు. విలీనం చేసే క్రమంలో తమ సంతకాలను సైతం ఫోర్జరీల చేసి, ఇష్టానుసారంగా మ్యాపింగులు చేశారని దుయ్యబట్టారు. ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేష్ అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించేశారు. ఎస్ఐ బెదిరించడంపై ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి తమ ఫిర్యాదుపై విచారించాలని కోరారు.

తప్పిపోయిన వ్యక్తిని బంధువులకు అప్పగింత



తప్పిపోయిన వ్యక్తిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

రేణిగుంట: తిరుమలలో తప్పిపోయి గాజులమండ్యం పరిసరాల్లో తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు విచారించి అతని ఆచూకీ కనుక్కొని బంధువులకు అప్పగించారు. మహారాష్ట్రకు చెందిన కొంతమంది వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు చేరుకున్నారు. సోమవారం మతిస్థిమితం లేని అనిల్ చవాన్ (38) అనే వ్యక్తి తప్పిపోయి గాజుల మండ్యం పరిసరాల్లో తిరుగుతుండగా స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు అతడిని స్టేషన్‌కు తీసుకొని వచ్చి విచారించగా తప్పిపోయినట్టు గుర్తించారు. అతని వద్ద ఉన్న వారి బంధువుల ఫోన్ నంబర్ ఉండగా వారికి సమాచారం అందించి బంధువులకు అతన్ని అప్పగించారు.

ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ

సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్



వరదయ్యపాళెం: పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవానికి రెండు రోజుల ముందు స్వేచ్ఛగా ఓటును వినియోగించుకునే హక్కును ఓటర్లు కోల్పోయారన్నారు. అందుకు కారణం పోలీసుల అండదండలతో టీడీపీ గూండాలు దౌర్జన్యం చేయడమేనని ఆయన వివరించారు. ఉపఎన్నికల్లో జరిగిన పరిణామాలను రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఉపఎన్నికలు, సాధారణ ఎన్నికలు జరగడం సర్వసాధారణమని, అయితే కూటమి ప్రభుత్వం అడ్డదారిలో గెలుచుకునేందుకు అనేక దుర్మార్గపు ఎత్తుగడలు చేపట్టడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితులన్నింటికీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పాటిస్తున్న మంత్రి లోకేష్ జవాబు చెప్పక తప్పదని ఆయన స్పష్టం చేశారు.

ఆర్టీసీ కార్మికులకు ఐఆర్ ప్రకటించాలి

సత్యవేడు: ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీ వెంటనే విడుదల చేయాలని ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.చెంచులయ్య కోరారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ సమీపంలో భోజన విరామ సమయంలో ఎన్ఎంయూ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ వేతన సవరణ జరిగి ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తయిందని, వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రిటైర్డు ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్మెంట్ చెల్లింపులు తక్షణం చేపట్టాలన్నారు. డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా 8 వేల పోస్టులు భర్తీ చేయాలన్నారు. డిపో సెక్రటరీ సుధాకర్, గ్యారేజ్ కార్యదర్శి ఎస్.శేఖర్, డిపో ట్రెజరర్ ఎస్.యుగంధర్, బాషా, కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించండి

నారాయణవనం: బాల్యం నుంచే ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలను క్రమం తప్పకుండా పాటించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండల ఆరోగ్య శాఖ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఎంపీడీఓ అరుణ, మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్, హెచ్ఎం సులోచన పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పేరంటాల ఉత్సవం

నారాయణవనం: ఏడు గంగమ్మల జాతర సందర్భంగా నారాయణవనంలో మంగళవారం అమ్మవారి గెరిగతో పేరంటాల ఉత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. బుధవారం నారాయణవనంతో పాటు సముదాయం, వీకే పాళ్యం, నాగిలేరు, ఎగువ, దిగువ బొప్పరాజుపాళ్యంలలో గంగ జాతరను నిర్వహిస్తున్నారు. నారాయణవనంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారు రాత్రంతా నారాయణవనం వీధుల్లో ఊరేగింపు ఉత్సవంలో పాల్గొని బుధవారం తెల్లవారుజామున కోమిటి బజారు వీధిలో నడివీధి కూడలిలో కొలువుదీరుతారని నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి ఏడు గంగమ్మల నిమజ్జనం నిర్వహించనున్నారు.

ప్రవచన కర్తకు సన్మానం

శ్రీకాళహస్తి: శ్రీశుక బ్రహ్మాశ్రమంలో గజేంద్రమోక్షం ప్రవచనాలు మంగళవారంతో ముగిశాయి. ప్రవచనకర్త బ్రహ్మశ్రీ శతావధాని ఆముదాల మురళిని ఘనంగా సన్మానించారు. ఆయనకు మాజీ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వామి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు.

వర్ష జ్యూస్ ఫ్యాక్టరీపై ఫిర్యాదు

రేణిగుంట: మండలంలోని వర్ష జ్యూస్ ఫ్యాక్టరీపై మంగళవారం రాష్ట్ర కిసాన్ మోర్చ నాయకులు లింగారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రేణిగుంట మండల మామిడి రైతులు మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి రైతుల కష్టాలను చూసి రూ.8 జ్యూస్ ఫ్యాక్టరీ, రూ.4 ప్రభుత్వం ఇచ్చేటట్టు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కానీ ఫ్యాక్టరీ వారు ఒక్కో రైతుకు ఒక్కో రకంగా రూ.3, రూ.4, రూ.5 బిల్లులు రాసి ఇస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.12 ఇప్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నియంత్రణ

బుచ్చినాయుడుకండ్రిగ: ఆల్బెండజోల్ మాత్రలతో పిల్లల్లో నులిపురుగులను నియంత్రించవచ్చని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఆయన మంగళవారం పల్లమాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంఈఓ రవీంద్రనాథ్‌తో కలసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. హెచ్ఎం గాయత్రి, సీహెచ్ఓ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: పాపానాయుడుపేట, ఏర్పేడు పీహెచ్‌సీల పరిధిలోని పలు స్కూళ్లలో విద్యార్థులకు వైద్యాధికారులు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పాపానాయుడుపేట హైస్కూల్‌లో విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యులు నాగరాజు, లావణ్య మాత్రలను మింగించారు. సీహెచ్ఓ రాజేశ్వరి, సూపర్‌వైజర్ మంజుల, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు: మండలంలోని సాంబయ్యపాలెం హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. మండల వైద్యాధికారి లహరి, డాక్టర్ సాయి పూజ, పీహెచ్ఎన్ సంపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ ధనమ్మ, లిఖిత్ కుమార్, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌బాడీ, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: పిల్లలు పోషకాలను తీసుకోవడంలో నులిపురుగులతో ఆటంకం కలుగుతుందని పిచ్చాటూరు ఎంఈఓ హేమామాలిని అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి మునిచరిత, వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కర్యాక్రమంలో ఆర్ఆర్‌సీవైఆర్‌సీ సమన్వయకర్త డా.ఆర్ చంద్రమౌళి, ప్రిన్సిపల్ నాగరాజనాయుడు, వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ, డా.తులసి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడి మృతి

రేణిగుంట: రియాక్టర్ పేలుడులో గాయపడి చికిత్స పొందుతున్న కార్మికుడు మృతి చెందాడు. గాజులమండ్యం పారిశ్రామిక వాడలో గల క్రోమో మెడికేర్ కంపెనీలో గత నెల 14వ తేదీ రియాక్టర్ పేలడంతో అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు కార్మికులకు చెన్నై ప్రైవేట్ వైద్యశాలలో వైద్యం అందిస్తుండగా చిట్టమూరు మండలానికి చెందిన వెంకటేష్ గత నెల 27వ తేదీ మృతిచెందాడు. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాకు చెందిన మరో కార్మికుడు రవీంద్రనాయక్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తామని గాజులమండ్యం పోలీసులు తెలిపారు.